విషాదాంత ప్రణయగాథ

# బలియు ప్రణయిని....

"ప్రభు"

స్కెచ్

ఈ కథ విషాదాంతం అని నా ఉద్దేశం, సుఖాంతం అని శారద నమ్మకం పోగా మేం ముగ్గురం ఉండగా (అఫీషియల్‌గా) ఇంతకన్న సుఖాంతం ఉండదనీ, ఉందని అనుకున్నవాడు లేడనీ, శేఖరం కథనం (ఆ సమయంలో వాడి ముఖం చూసిన వాడిది పాపం) నేనూ వాడూ కూర్చుంటే నా పార్టీ శేఖరం శారద సమక్షంలో నేనూ శేఖరం పార్టీయే అనుకొండి.

పది నిముషాలక్రితం శేఖరం మా ఇంటికి వచ్చాడు - శ్రీమతి ఇద్దరికీ అని కాఫీ తెచ్చింది

వాడు బాధగా నా వంకా, ఆమె వంకా చూసి "నాకు అక్కర లేదు ." అన్నాడు

ఏదన్నా జరగవచ్చును కాని, ఇది చాలా ప్రమాద సూచకం అని లోకంతో బాటు నేనూ నమ్ముతాను—లక్షణంగా దంపతులం ఇచ్చినకాఫీ వొద్దనడం

శ్రీమతి చిన్నబుచ్చుకోవడం చూసి వాడు బాధపడి, "మరేం లేదండీ—ఇంటికి వెళ్లేసరికి శారద టీతో ఎదురు చూస్తూ ఉంటుంది, ఊరికే చూసిపోదామని వచ్చాను" అన్నాడు

"కాఫీయేగా! త్రాగండి" అని ఉత్సాహ పరిచింది శ్రీమతి

"చాలా కొత్తవాడివైపోయావ్!" అన్నాను నేనూ

"నీ మూలంగానే!"—అని, నాలిక కరుచుకున్నాడు శేఖరం

ఆడవాళ్ల కౌతుకం సూదిమల్లే జారిపోతుంది అసలు విషయంలోకి మా ఆవిడకి నా మీద గొప్ప ఉద్దేశం. అల్లరి చెయ్యడంలోనూ, గొడవలు తేవడంలోనూ నా పాటివాడు లేడని. అంటే, ప్రత్యక్షంగా "ఏమిటి కథ? ఏమిటి యీ బాధ? ఎందుకి వ్యథ?" అని రపీమని అడిగి లేదను కొండి కాని అదే నయం అనిపించేంత వాడిగా చూసింది నా వైపు తిరిగి

శేఖరం మీద నాకు ఉన్నతమైన అభిప్రాయం లేదుగాని, ఇవాళతో ఉన్న అనుమానాలు కూడా పోయాయి

అక్కడికి-"మొన్న ఆరోగ్య సూత్రాలమీద నే నిచ్చిన ఉపన్యాసం నీ మీద ప్రయోగిస్తూందా శారద?" అన్నాను

అది పనిచేసి ఉండును కాని, గాభరాపడి పోతూ ముఖం ప్లంపెంట్ ట్యూబ్ మల్లేచేసి- "ఆఁ. అవును" అని సకిలించేడు శేఖరం, అది అబద్ధం అని వేరేచెప్పాలా దొరా? అన్నట్లు

మా ఆవిడ మాట్లాడకుండా కూర్చుంది అది డేంజర్ సిగ్నల్ అన్నమాట అ సంగతి తెలిసిన శేఖరం లేచి "వెడతానండీ ..సినిమాకి వెళ్ళాలి శారద చూస్తూ ఉంటుంది" అని బయలు దేరేడు

చూస్తూ ఊరుకోక, "ఏ సినిమా?" అన్నాను

వాడి తలలో ఏ మాత్రం గ్రేమేటర్ ఉన్నా, మరో జవాబు ఇవ్వొద్దూ?.. .తడుముకోకుండా "'సనమ్'కి" అని, జారుకున్నాడు.

సరిగ్గా పదహారు గంటల ముందు వీడు ఆ సినిమాకి ఏమైనా వెళ్ళనని మాతో చెప్పేడు. ఇన్నీ జరిగాక శ్రీమతికి ఏం చెప్పను?

వాడు అటు వెళ్ళగానే మాఆవిడ చేతిలో ఉన్న ఎంబ్రాయిడరీమీద ద్విగుణీకృతవేగంతో నిశ్శబ్దంగా పని సాగించింది. అంటే డేంజర్ ఎక్కువౌతోందన్న మాట నాకై నేను ఉన్న దంతా చెప్పేనా, సరేసరి....

"చూడు అమ్మాయీ....నువ్వేదో భ్రాంతిలో ఉన్నావు" అన్నాను .... ఎలాగైనా యీ కథ చెప్పడం మానుదామని.

ఆవిడ ఎంబ్రాయిడరీ సరంజామా లోపల పెట్టివొచ్చి నా ప్రక్కన

కూర్చుని ఒక సిగరెట్ అందించి, స్వయంగా లైటర్‌కూడా వెలిగించింది.

పైవాళ్ళకి ఇంత మంచి అమ్మాయి లేదనీ, నా అంత అదృష్టం ఇంకే అబ్బాయికీ ఉండదనీ అనిపించొచ్చు. కాని దీని అంతరార్థం—"మంచి పిల్లవాడిలాగా ఉన్నది చెప్పేశారా, బ్రతికేశారు. లేదా, మీపు జాగ్రత్త అదే పోయిందని ఓ ఛాన్సు ఇస్తున్నాను. ఊఁ-" అని

* * *

ఆ రోజున శేఖరం ఇట్లానే వొచ్చాడు రూముకి-ఉస్సురని నిట్టూరుస్తూ కాఫీ ఇస్తానంటే వొద్దన్నాడు సిగరెట్ కాల్చనన్నాడు వెర్రి మొహం వేసుకుని అలాగే దిక్కులు చూస్తూ.

ఇలాటి జబ్బులకి డయాగ్నస్ చెయ్యడంలో అఖండుడిని కాబట్టి-"ఏంభాయ్? ఏ అనమాన సుందరి అనే చెదపురుగు నీ కళ్ళలోనించి తలలోఉన్న గుహలోకి ప్రవేశించి నీమాంద్యాన్ని శతాధికం చేస్తూన్నది?" అని అడిగేశాను

ముందు కోపం ఒచ్చేసింది వాడికి, తరువాత సిగ్గు, వెనువెంటనే ఏడుపు. ఇంకవేరే చెప్పాలా?

వాడు కళ్ళు గిర్రున తిప్పుతూ నా టేబిల్ మీది ఫోటోచూసి, "ఆ అమ్మాయి అందంగా ఉందంటావా?" అన్నాడు

"కళ్ళు పాడయ్యాయా?" అన్నాను

"కోపం వొద్దు భాయీ.... ఊరికే పోయింటికి drive చేస్తున్నాను నువ్వు వలచిన అమ్మాయి అందంగా ఉండకపోవడం ఏమిటి?" అన్నాడు కాస్త నార్మల్‌లోకి వొచ్చి

"కానీ—" అన్నాను,

"శశిరేఖ అంతకన్న అందంగా ఉంది... ఓహ్! ఏమి Physique ... ఎంత చలాకీ!. " ఇట్లా బ్రాడ్‌కాస్ట్ మొదలెట్టాడు

కాస్త వాల్యూం తగ్గించి — "ఎవర్రా?" అన్నాను

"అరే! శశిరేఖ భాయ్ .. . ఓహెూ... నీ స్టూడెంట్‌కాదు కాబోలు. .అరే—అన్నట్లు నీ శిష్యురాలే!" ఇలా సాగించాడు

నిలవదీసి అడిగేశాను చెప్పేశాడు

ఆ రోజు కాలేజీ గేమ్స్‌లో ఆ అమ్మాయి పాల్గొందిట. Sports dress వేసుకుని తయారవడంతో శేఖరానికి కళ్ళు తిరిగిపోయాయి—ఒకటే గోలగా ఆమెని వర్ణించడం మొదలు పెట్టేడు.

మళ్లా వాణ్ని కట్‌చేసి, "కలకత్తాలో చదువుకున్నావు గదా! (అదంతా ఓ కథ లెండి....) అక్కడ యీ మాత్రం సుందరి—"

అనకముందే వాడు ఒక్కసారి సీరియస్ ఐపోయి—"శశిరేఖని ప్రేమించాను బ్రదర్! ఇన్నాళ్ళూ ఏమిటో అనుకున్నానుగాని, ఆమె... "

"తరతరాలనించి, యుగయుగాలలో, జగజగాలలో కరడుగట్టిన ప్రేమ కరగి పొంగి పొరలి బలీయంగా నీ సర్వశక్తులనీ ఉడిగించి నీ దుఃఖాన్ని ముంచి నిన్ను తరించి తనియింపజేస్తూంది ఏం?" అన్నాను Sarcastic గా.

"ఎంతబాగా చెప్పేవు బ్రదర్!" అన్నాడు వాడు నేనే ఓడిపోయాను మరొకడైతే అర్థం చేసుకొని ఉండును వీడు ప్రేమలో ఉన్నాడు మరి!

"ఆల్‌రైట్! ఆ చొక్కాకి ఇంతమట్టి అంటించి చించిపారెయ్ క్షవరం మానెయ్ తిండి మానెయ్ పాట్లు పాడెయ్ అవిడే వొచ్చి వరిస్తుంది" అన్నాను

చాలా బాధపడిపోయాడు వాడు, నా వరస చూసి

"నువ్వేమైనా సహాయం చేస్తావంటే...." అలాగ నీళ్లు నమిలేశాడు,నాకూ జాలికలిగేలా.

శశిరేఖ బి ఏలో నా స్టూడెంటు అదీ వీడి ఆశ

"ఆ అమ్మాయి మిలిటరీ రకంరా..." అన్నాను

"నీమాట అయితే వింటుందిట "అన్నాడు వాడు ఒక్కసారి జ్వరం వచ్చిలేదన్నమాట

కాస్త ఆలోచించాను. సామాన్య ప్రేమ పద్ధతులు ఈ అమ్మాయి విషయంలో పనికిరావు కావలిస్తే మీద చెప్పినవన్నీ చేస్తాడుగాని, ఆ పైన లాభంలేదు.

"ఏం చెయ్యమంటావ్?" అన్నాడు

"వాళ్ళ వాళ్ళ నడిగీ—" అన్నాను

"ఆ అమ్మాయిపెళ్ళి ఆమె ఇష్టమేటుగా? నీకు తెలియనట్లు...." చాలాబాధ

ఇంక వీడిని మభ్యపెట్టి లాభంలేదని.... "చూడూ-కారణాంతరాలవల్ల ఇలాటిఅమ్మాయి ప్రణయం ఒకటి పరిశీలించాల్సి వొచ్చింది—"

"ఆఁ నీ కథల్లో—"

"అవునులే....వీలైనప్పుడు నీ ప్రేమ వ్యవహారం కాస్త ముదురుపాకంలో సాగనీ. అంటే చెత్త ఉత్తరాలూ, అతి చెత్త ఉపన్యాసాలూ దంచకు ఏకాంతంలో భరించలేని నీ ప్రేమనీ గాఢమైన కౌగిలింతలో చూపెట్టు-"

"తెలిసింది.. తెలిసింది చూశావా? నీ తల పెట్టాలే గాని నీ అంత సైకాలజిస్ట్.. "

* * *

[అక్కడికి ఒకటో ఘట్టం ముగిసింది]

ఒక రోజు ఉదయం కాలేజీలో టెలిఫోన్‌లో ఎవరో పిల్చారని ప్యూన్ చెప్పేడు. ఆఫీసుకి వెళ్ళాను శేఖరం!

"వెంకటరామన్ హాస్పిటల్‌నించి మాట్లాడు తున్నాను. వెంటనే ఒకసారి రా . "

సంగతి ఏమిటని ఏం అడిగినా చెప్పలేదు. నాకు తెలిసిపోయింది శశిరేఖ కోసం బెంగ పెట్టుకుని వీడు మంచం ఎక్కి ...

ప్రిన్సిపాల్‌తో చెప్పి వెళ్ళాను.

వాడి ముఖం పాడయిన భూతద్దంలోంచి చూసినట్లు కనిపించింది ఒక కాలు స్లింగులో ఉంది. అంతా చిందరవందరగా ఉన్నాడు ప్రేమలో అధ్యాయం కాదనీ-ఏ కారో, మోటారు సైకిలో వీణ్ని గాఢంగా ప్రేమించడాన్న.

"రా భాయ్" అన్నాడు వాడు గాద్గదికంగా

"ఏం జరిగింది?" అన్నాను

జరిగినదంతా చెప్పేడు వాడు—తొలి రోజు సాయంత్రం శశిరేఖ షికారు వెడుతూంటె వీడు వెనకాల పడ్డాడు ఆవిడ గోదావరి వెంట వెళ్ళి వెళ్ళి ఒకచోట ఏకాంతంగా కూర్చుంది

"ఉరికి, పడ్డావా?" అన్నాను

లేదుట - (పాపం!) - నా సలహా ప్రకారం శేఖరం వెళ్ళి కించిత్ ఉపోద్ఘాతంతో శశిరేఖని కౌగలించుకున్నాడు

ఆవిడ చివ్వున లేచి — ఆ వివరాలన్నీ ఎందుకుగానీ, క్లుప్తంగా, ఆ ప్రయత్నానికి ఆవిడ కోమల హస్తాల జవాబు....

"ఉరిపోసుకుని చచ్చిపోదామని ఉంది బ్రదర్...."

కాదూమరీ!....నాకూ అలాగే అనిపించింది. ఇంత బ్రతుకూ బ్రతికి....

"ఆడపిల్లని చితక్కొట్టలేకపోయావా?" అన్నాను మూర్ఖంగా.

"ఛా! — నీకు తలకాయేగాని, మనస్సు లేదురా! చూస్తూ ఎలాగ చెయ్యిచేసుకునేది!" అని వాపోయాడు శేఖరం.

కాని, వాడి తిక్కమాత్రం పూర్తిగా తిరిగింది

"కొంచెం స్థిమితపడ్డాక కలకత్తావెళ్ళి ఏదో ఉద్యోగం చూసుకుంటాను .ఈలోపున నువ్వు ఆవిడ ఈ కథ పబ్లిష్ చెయ్యకుండా చూసే పూచీ. . "

వాడి బాధ నాకు అర్థం ఐంది

"మరి నీ ప్రేమ.. "

ఉద్రేకంగా వాడు ఏదో అనబోయాడు— దవడ సలిపింది తగ్గి—"ఆ హిట్లర్ పిల్ల పది లక్షల కట్నానికికూడా నాకు వొద్దురా బ్రదర్ బ్రతికానని మళ్ళా ఈ వేపుకి రాకుండా "

అలా మూలిగేడు వాడు

నేనూ చాలా Feel అయాను వాడు వాపుకొద్దీ అనకపోయినా, నా సలహా విని ఇంత పీకలమీదికి తెచ్చుకున్నాడు గదా అని

ఆ సాయంత్రం శశిరేఖని ఇంటికి పిల్చుకుని వచ్చాను నెమ్మదిగా శేఖరం విషయం ఎత్తాను

"ఆయన మీకు తెలుసా?" అంది ఒక్కసారి కరిగిపోయి

"అవునమ్మా... నాకు మిత్రుడు పొరపాటే చేశాడనుకో. నా మాటవిని ఎవరితోనూ "

నేను పూర్తిచెయ్యకుండానే— "ఆయన ఎక్కడ ఉన్నారు?" అంది శశిరేఖ

"హాస్పిటల్‌లో.. ."

"నన్ను తీసికెళ్లండి" అంది శశిరేఖ

హడలిపోయాను ఇంకా ఏం మిగిలింది వాడిలో—పచ్చడికాక!

"అంత తొందరవొద్దు అమ్మాయీ! ఏదో జరిగింది నీ కోపానికి అర్థంలేదు" అన్నాను

ఆమె బాధగా నావంక చూసింది - ఇంత అజ్ఞానివా అన్నట్లు. చచ్చాన్రా అనుకున్నాను ఈమెని చూడగానే, సంగతి తెలీకుండానే వాడు ప్రాణాలు వొదిలేస్తే?

తప్పక, ఆమెని హాస్పిటల్‌కి తీసికెళ్లేను ఆ సంభాషణ చిలకపలుకుల్లాగా, నేను రాయని ప్రణయ గాథలలో మధుర సంభాషణల్లాగా సాగింది వాడిమీద వాలి ఆ అమ్మాయి అన్ని దెబ్బలూ తడిమి కళ్లనీరు తెచ్చుకుంది (వాడికి వచ్చాయనుకో ) తొలిసాయంత్రం ఆమెకి వొళ్ళు తెలియలేదుట అతను చెయ్యి ఎత్తితే వొట్టు

అలాగ సాగింది ఆవిడని దిగబెట్టి, మళ్ళా మళ్ళా ఆవిడ క్షమాపణలనీ, శేఖరంకోసం ఇచ్చిన ప్రేమ సందేశాలనీ పట్టుకుని, వాడి ఆనందం Imagine చేసుకుంటూ హాస్పిటల్‌కి వచ్చాను

పెద్దషాక్ తిన్నానక్కడ. వాడు వెళ్ళిపోడానికి సిద్ధంగా ఉన్నాడు ఆ కట్లతోనే

"ఏమిటిది?" అన్నాను

కళ్లనీళ్ల పర్యంతం ఐంది వాడికి

"ఆవిడని మళ్ళా నా పీకలమీదికి తీసుకొస్తావా?. ఎందు కింత పగ?" అన్నాడు శేఖరం

"అదేమిట్రా? ఆ అమ్మాయి జరిగినదానికి చాలా విచారిస్తోంది నువ్వంటే చాలా ప్రేమ-నాకు తెలుసు. వెర్రివేషాలు వెయ్యక నాలుగు రోజులు మరమ్మత్తు పూర్తికానిచ్చి, లక్షణంగా పెళ్ళిచేసుకో" అని బుద్ధి చెప్పేను "నువ్వెక్కడ ఉన్నా, వెతికి తెచ్చుకుంటుందిట—పాపం!" అని ఆమె మాటలనీ వాడికి ఒప్ప చెప్పాను

ఇంక నాతో మాటలాడడం మానేశాడు వాడు. ఎక్కడికీ వెళ్ళనని ఒట్టువేయించుకుని, ఇంటికి వెళ్ళేను

"ఆ తరవాత కథ ఆట్టేలేదు. మరోవారం రోజుల తరువాత పెద్దలు మాట్లాడుకుని ముహూర్తం నిశ్చయించారు నేనూ సాయం చేశాననుకో....ఇద్దరూ నాకు కావాల్సినవాళ్లేగా! వెంటనే వధూవరులు హనీమూన్‌కి కాశ్మీరువెళ్లి క్రిందటివారం వచ్చారు నీకు శారదా శేఖరం తెలిసినా, ఈ కథ తెలీదు ఆ అమ్మాయిని కాలేజీలో శశిరేఖ అని పిలిచేవారు. అంత అందంగా ఉండేది ప్రస్తుతం వీడిని కాస్త అదుపులో పెడుతోందనుకుంటాను నుంచిదే" అని కథనం ముగించాను

శ్రీమతి ఎక్కడైనా దొరికే లోపాలకోసం వెతికి—"చివరికి అతను సంతోషంగా ఒప్పకున్నాడా?" అన్నది.

"లేదనుకో....శారద రెండు మూడుసార్లు అతన్ని కలుసుకున్నాక నాతో అన్నీ చెప్పడం మానేశాడు" అన్నాను.

ఆలోచిస్తూ అలాగే కూర్చున్నాము

"పాపం!...." అంది శ్రీమతి.

"పాపం—శేఖరం!" అన్నాను నేను.

"అతనికేం?....శారద .... పాపం—దేనికీ అతనిమీద ఆధారపడలేదుగదా!" అంది జాలిగా శ్రీమతి

తెల్లబోయి - నా ఆశ్చర్యం నేనే దాచుకున్నాను

"అతను అదృష్టవంతుడు - కావాల్సిన అమ్మాయి సిరితో వొచ్చి అతన్ని బాగుపరుస్తూంది" అంది, మళ్ళీ శ్రీమతే.

నేను సిగరెట్ వెలిగించుకుని, పుస్తకం తీసుకున్నాను. ఆవిడ లోపలికి వెళ్ళి ఎంబ్రాయిడరీ సరంజామా తెచ్చుకుని తన పని చూసుకుంటూంది.

అంటే—

ఏమైతే నేమిలెండి....అయినా దాని అర్థం మీకూ తెలుసును.

★

